క్లుప్తంగా

మెరుగైన సేవలందించాలి
ఎంపీడీవో శ్రీనివాసరావు



పెదగొల్లపాలెం(కర్లపాలెం): గ్రామ సచివాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. పెదగొల్లపాలెం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు సమస్యల పరిష్కారం కోసం గ్రామ సచివాలయాలకు వచ్చినప్పుడు వారితో గౌరవంగా మాట్లాడాలన్నారు. సిబ్బంది నిర్దేశిత సమయానికి సచివాలయానికి రావాలని తెలిపారు. గ్రామంలో జరుగుతున్న సర్వే కార్యక్రమాలను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



బాపట్ల: అయోధ్యలో బాలరామాలయం నిర్మించి ఏడాది పూర్తయిన సందర్భంగా యువ మోర్చా అధ్యక్షుడు నాలం నరేష్ ఆధ్వర్యంలో స్థానిక పోలేరమ్మ గుడి వద్ద ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేపట్టారు. ఈ సందర్భంగా నాలం నరేష్ మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన రామాలయాన్ని నిర్మించటం దేశ ప్రజలకు గర్వకారణంగా చెప్పవచ్చన్నారు. రాష్ట్రానికి సుమారు వివిధ పథకాలకు రూ.3 లక్షల కోట్లు పైగా సహకారం అందించి, విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్వహణకు రూ.11 వేల కోట్లు ప్రకటించటం గొప్ప విషయమన్నారు. రైతులకు పెట్టుబడి సాయం పెంచి దేశాన్ని ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలబెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడి రమేష్, బొమ్మిశెట్టి ప్రసాద్, ఇమ్మడిశెట్టి రాము, బాబు నాగేంద్ర, గుండ్రెడ్డి శ్రీహరి, జొన్నకూటి శ్రీనివాస్, కర్నేటి మోహన్, ముప్వల శ్రీనివాసరావు, ఎలవల దుర్గాప్రసాద్, కామిశెట్టి సాయిబాబు, ఆలపాటి బాలాజీ, తురక గోపి, నరాలశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

38 డిఫెన్స్ మద్యం బాటిళ్లు స్వాధీనం



రేపల్లె రూరల్: అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ తెలిపారు. నిందితుని వివరాలను కార్యాలయంలో బుధవారం ఆయన వెల్లడించారు. పట్టణానికి చెందిన తులసీ హేమకుమార్ తన నివాసంలో 750 మిల్లీలీటర్ల 38 డిఫెన్స్ మద్యం బాటిళ్లను నిల్వ ఉంచాడన్నారు. తమకు అందిన సమాచారంతో అతని గృహంలో తనిఖీలు నిర్వహించి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవటంతో పాటు అరెస్ట్ చేశామన్నారు. నివాస గృహాలలో అక్రమంగా మద్యం నిల్వలు ఉంచినా, విక్రయాలు జరిపినా చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు నరహరిరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీఆర్ఎం కళాశాలలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



నగరం: బాల్ బ్యాడ్మింటన్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల టోర్నమెంట్ ఎస్వీఆర్ఎం కళాశాలలో జరుగుతుందని కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్యచౌదరి చెప్పారు. కళాశాలలో బ్యాడ్మింటన్ కోర్టులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ నెల 24, 25 తేదీలలో బాల్ బాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు. టోర్నమెంట్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ పాల్గొన్నారు.

హోటల్ నిర్వాహకుడు అదృశ్యం



తెనాలి రూరల్ : హోటల్ నిర్వాహకుడు అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఖాజీపేట గ్రామానికి చెందిన 59 ఏళ్ల పసుపులేటి విజయ్‌కుమార్ హోటల్‌కు అవసరమైన సరుకులు కొనుగోలు చేసేందుకు మంగళవారం సాయంత్రం వెళ్లి తిరిగి రాలేదని కుటుంబసభ్యులు గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బుధవారం కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ తెలిపారు.



నేతాజీనగర్ వద్ద గుర్రపు డెక్కతో నిండిపోయిన వాడమురుగు డ్రెయిన్



23వ వార్డులో రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త నిల్వలు

పారని మురుగు.. పట్టని అధికారులు

- పట్టణంలో క్షీణిస్తున్న పారిశుధ్యం
- దోమల దండయాత్రతో ప్రజల ఇబ్బందులు
- చెత్త నిల్వల్లో పందుల స్వైర విహారం



24వ వార్డులో చెత్త నిల్వలో పందుల స్వైర విహారం



రైల్వే స్టేషన్ సమీపంలో వాడ మురుగు డ్రెయిన్‌లో మురుగు నీరు

రేపల్లె రూరల్: పట్టణంలో పారిశుద్ధ్యం క్షీణిస్తుంది. ప్రధాన వీధులు మినహాయించి అంతర్గత రహదారుల్లో చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయి. రోజుల తరబడి రహదారుల వెంట చెత్త నిలవ ఉండడంతో పందుల సంచారం అధికమైంది. చెత్త కుప్పలను పందులు కలచివేస్తూ రహదారిపై చిమ్మటంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారుతుంది. చెత్త నిల్వలు అధికమవ్వటం, పందుల సంచారం పెరగటంతో ఆయా ప్రాంతాలు దుర్గంధ భరితంగా మారుతున్నాయి. దీంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని పట్టణ వాసులు భయాందోళన చెందుతున్నారు.

దోమలకు ఆవాసం

పట్టణంలో డ్రెయిన్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో డ్రెయిన్లు నిండిపోవడంతో మురుగునీరు పారుదలకు ఆటంకం ఏర్పడుతోంది. రోజుల తరబడి మురుగునీరు పారుదల లేకపోవడంతో దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. ప్రధానంగా వాడమురుగు డ్రెయిన్, రేపల్లె డ్రెయిన్‌లు చెత్తచెదారం, గుర్రపు డెక్కతో పూర్తిగా నిండిపోయాయి. పట్టణంలోని మురుగు నీరు ఈ కాల్వల ద్వారానే పారుదల కావాల్సి ఉంది. మురుగునీరు రోజుల తరబడి పారుదల లేకుండా నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెంది స్వైర విహారం చేస్తున్నాయి. పగలు రాత్రి తేడా లేకుండా దోమల దాడితో పట్టణ ప్రజలు విలవిలలాడుతున్నారు. సాయంత్రం అయితే ఆరుబయట కుర్చోవాలంటే ప్రజలు భయపడే పరిస్థితులు ఉన్నాయంటే పట్టణంలో దోమల ఉధృతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది.

తూతూ మంత్రంగా ఫాగింగ్

దోమల నివారణకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఫాగింగ్ కార్యక్రమాలు తూతూ మంత్రంగానే ఉంటున్నాయంటూ ప్రజా సంఘాలు విమర్శిస్తున్నాయి. దోమల నివారణకు డ్రెయిన్లలో ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పట్టణ ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఫాగింగ్ నిర్వహణ కొరకు ఇటీవల కొనుగోలు చేసిన వాహనం మొదట్లో ఆర్భాటంగా పట్టణంలో ఫాగింగ్ చేసినా ప్రస్తుతం దీనిని పక్కన పడేసారని ప్రజల నుంచి ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత మెరుగుపరచటంతో పాటు దోమల నివారణకు చర్యలు ముమ్మరం చేయాలని కోరుతున్నారు.

ఫాగింగ్ నిర్వహిస్తున్నాం



పట్టణంలో దోమల నివారణకు నిరంతరం ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. దోమల వృద్ధిని అరికట్టేందుకు డ్రెయిన్‌లు పారుదల అయ్యేలా నిత్యం పూడికలు తీయిస్తున్నాం. పందులను అధీనంలో ఉంచుకోవాలని యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. వాడమురుగు డ్రెయిన్‌లో నేతాజీనగర్ వద్ద కాల్వలో స్థానికులు చెత్త చెదారం పడవేయరాదు. సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పారిశుద్ధ్యం మెరుగుపర్చుతాం.

– కాకర్ల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్, రేపల్లె

మినుము సాగులో తెగుళ్లపై దృష్టి సారించాలి

మండల వ్యవసాయ శాఖ అధికారి మహేష్‌బాబు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మహేష్‌బాబు

చెరుకుపల్లి: మినుము సాగులో తెగుళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మహేష్‌బాబు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆరేపల్లి, తూర్పుపాలెం గ్రామాల్లో మినుము సాగుపై బుధవారం నిర్వహించిన క్షేత్ర పర్యటనలో ఆయన మాట్లాడారు. పల్లాకు తెగులు, బూడిద తెగులు ఆశించేందుకు అవకాశం ఉందన్నారు. పల్లాకు తెగులు ఆశిస్తే లీటరు నీటికి 5 మి.లీ. వేప నూనె గానీ, వేపగింజల కషాయం గానీ పిచికారీ చేయాలన్నారు. పూత దశలో ఆశించే బూడిద తెగులు నివారణకు థయోఫినేమిథైల్ 1 గ్రా. గానీ, డైఫెన్ కాన్‌జెల్‌ను 1 మి.లీ. గానీ లీటరు నీటికి కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. అదే విధంగా కలుపు నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. రైతులు ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు, వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం



బూతుమల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏడీఏ అక్తర్ హుస్సేన్

చంపాడు(వేమూరు): మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు పురుగు మందులు పిచికారీ చేయాలని బాపట్ల రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ అక్బర్ హుస్సేన్ అన్నారు. వేమూరు మండలంలోని చంపాడు, బూతుమల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ జొన్న, మొక్కజొన్న పంటకు ఎరువులు వాడకం గురించి రైతులకు వివరించారు. ఎండు తెగులు నివారణకు ఎకరానికి 500 గ్రాములు హెక్సకనాజో పిచికారీ చేయాలన్నారు. జొన్న, మొక్కజొన్న పంటల్లో రబ్బరు పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చందోలు సునీత, రైతులు, గ్రామ వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.


అపరాల పైరులో బూడిద తెగులు




అమర్తలూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ లోకేశ్వరి

అమర్తలూరు(వేమూరు): అపరాల పైరులో ప్రస్తుతం బూడిద తెగులు ఆశించి ఉందని దీని నివారణకు ఇండిక్స్ ఎకరాకు 100 గ్రాములు పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి ఉయ్యూరి లోకేశ్వరి తెలిపారు. అమర్తలూరు మండలంలోని అమర్తలూరు, పాంచాళవరం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెల్ల దోమ ఉధృతి వలన ఎల్లో మొజాయిక్ వైరస్ వ్యాప్తి చెందుతుందని, దీని వలన మొక్కలు పసుపు రంగులోకి మారి పూత, పిందె లేకుండా పోతాయని, నివారణకు ఎసిటామిప్రిడ్ ఎకరాకు 60–80 గ్రాములు పిచికారీ చేయాలని ఆమె సూచించారు. పెసర, మినుములో 30–35 రోజుల లోపు తేలికపాటి నీటి తడి అందించి కలుపు నివారణ మందులు పిచికారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

క్యాంటీన్, స్టాండ్ తొలగింపునకు కుట్ర



క్యాంటీన్, సైకిల్ స్టాండ్ తొలగించేందుకు తీర్మానం చేసిన కాపీ



ఎభుత్వం ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదంటూ నివేదిక ఇచ్చిన ఏరియా వైద్యులు

రాజకీయ కక్ష సాధింపుకు సిద్ధమయిన కూటమి ప్రభుత్వం

బాపట్ల : అభివృద్ధి చేస్తామనే సాకుతో కూటమి ప్రభుత్వం మరో అరాచకానికి దారులు వెతుకుతుంది. రాజకీయ కక్ష సాధింపులకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతుంది. ఎప్పటి నుంచో బాపట్ల ఏరియా వైద్యశాల వద్ద ఉన్న క్యాంటీన్, సైకిల్ స్టాండ్ తొలగించేందుకు వ్యూహరచన చేస్తోంది. కూటమి ప్రభుత్వ కుటిలమైన నిర్ణయాలను వైఎస్సార్‌సీపీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జోగి రాజా బయట పెట్టారు. జోగి రాజా తెలిపిన వివరాలు ప్రకారం..

నెలకు రూ.32,250 చెల్లిస్తున్నప్పటికీ వేధింపులు

బాపట్ల ఏరియా వైద్యశాల ప్రాంతం అభివృద్ధిలో భాగంగా అక్కడ ఎప్పటి నుంచో సైకిల్ స్టాండ్, హోటల్ పెట్టుకుని నివసిస్తున్న నర్రావుల వెంకట్రావు ను అప్పటి ఎమ్మెల్యే కోన రఘుపతి ఖాళీ చేయించారు. హాస్పిటల్ అభివృద్ధి కోసం నెలకు రూ.32,250 చెల్లించే విధంగా సైకిల్ స్టాండ్, క్యాంటీన్‌ను ఇచ్చారు. అద్దెను పెంచుకుంటూ పోయే విధంగా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ తీర్మానం చేసి ఇచ్చింది.

తాజా పరిస్థితి ఇలా..

సైకిల్ స్టాండ్, క్యాంటీన్ ఉన్న ప్రదేశంలో అదనపు గదులు నిర్మించాలని, అక్కడ ఉన్న వాటిని తొలగించాలని కూటమి ప్రభుత్వం తీర్మానం చేసింది. అయితే సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం అడిగితే అక్కడ ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టడం లేదని, నిధులు మంజూరు కాలేదని స్పష్టంగా సమాచారం ఇచ్చారు. కేవలం వైఎస్సార్‌సీపీ నాయకుడు కావటం వలననే వెంకట్రావుపై కక్ష సాధింపులకు దిగుతున్నారని ఎస్సీ సెల్ అధ్యక్షుడు జోగి రాజా పేర్కొన్నారు.

అయోధ్య ఆలయ వార్షికోత్సవ పూజలు



కాళికాంబ గుడి వద్ద అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



మహిళలకు చీర, జాకెట్టు పంపిణీ చేస్తున్న బండ్రెడ్డి రజిని

మార్మోగిన శ్రీరామ నామం

కర్లపాలెం: అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ట జరిగి సంవత్సరం అయిన సందర్భంగా కర్లపాలెం సెంటర్‌లోని వీరభద్రస్వామి సమేత కాళికాంబ అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ కమిటీ సభ్యు లు, శ్రీరామ భక్తులు హనుమంతుని జెండాలు చేతబట్టి జై శ్రీరామ్ అంటూ భజనలు చేశారు. అనంతరం అయోధ్య రాముని ఆలయ వార్షికోత్సవంలో భాగంగా కాళికాంబ భక్త బృందం ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

బాల రాముని ప్రతిష్ఠించిన రోజు ప్రత్యేక పూజలు

బాపట్ల: అయోధ్య రామ జన్మభూమిలో నూతనంగా దేవాలయం నిర్మించి బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట జరిగి సంవత్సరం (మొదటి వార్షికోత్సవం) పూర్తి చేసుకున్న సందర్భంగా వివిధ దేవాలయాలలో పూజలు నిర్వహించి ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం హిందువుల ఇళ్లల్లో దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బండ్రెడ్డి రజిని ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు నిర్వహించి పూజల్లో పాల్గొన్న మహిళలకు చీర జాకెట్టు పంపిణీ చేశారు. అనంతరం ప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో నాగేశ్వరి, సాయిలీల తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తాం
కమిషనర్ జి.రఘునాథరెడ్డి



బాపట్ల: పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ జి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు కొబ్బరినూనె, చెప్పులు వంటివి కూడా ఇవ్వటం జరిగిందని తెలిపారు. కార్మికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ కరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో బొర్రా శ్రీనివసరావు చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

నేడు తెనాలిలో అర్బన్ మార్కెట్ ఏర్పాటు

తెనాలి అర్బన్: మెప్మా మిషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో గురు, శుక్రవారాలలో మార్కెట్ వద్ద అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం సహాయ సంఘ సభ్యులు తయారు చేసిన పిండి వంటలు, ఇతర వస్తువులను ఇక్కడ అమ్మకాలు జరపనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు తయారు చేసే వస్తువులకు మార్కెట్‌ను కల్పించాలనే ఉద్దేశంతో దీన్ని ప్రతి నెలా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పట్టణ ప్రజలంతా స్టాల్స్‌ను పరిశీలించి వారిని ప్రోత్సహించాలని ఆయన కోరారు.

గ్రాంథికమ్ము నెత్తిన పిడుగు 'గిడుగు'



గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పిస్తున్న రావూరి

బాపట్ల: వ్యావహారిక భాషా పితామహులు గిడుగు వెంకట రామమూర్తి అని సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహ వర్మ అభివర్ణించారు. సాహితీ భారతి ఆధ్వర్యంలో బాపట్ల జమేదారు పేటలోని సాహితీ భారతి కార్యాలయంలో జరిగిన గిడుగు వర్ధంతి సభకు రావూరి నరసింహ వర్మ అధ్యక్షత వహించారు. ఎవరు ఎన్ని విధాలుగా వేధించినా గిడుగు రామమూర్తి పాఠ్య పుస్తకాలలో గ్రాంథిక భాషకు బదులు వ్యావహారిక భాషను ప్రవేశపెట్టటానికి ఎనలేని కృషి చేశారన్నారు. ప్రజా కవి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ గిడుగు లిపిలేని సవర భాషకు కూడా లిపిని కనుగొన్నారన్నారు. సవర- ఇంగ్లీషు భాషా నిఘంటువును కూడా రూపొందించారన్నారు. సాహితీ భారతి ఉపాధ్యక్షుడు మాల్యాద్రిరావు మాట్లాడుతూ గిడుగు బహుభాషా కోవిదులని అన్నారు. వారు గొప్ప సంఘ సంస్కర్త హేతువాది కూడా అని తెలియజేశారు. గిడుగు జయంతి అయిన ఆగస్టు 29వ తేదీ 'తెలుగు భాషా దినోత్సవం'గా ప్రకటించబడినదని అన్నారు. సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ, ఎం.జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొద్దుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కాళిదాసు పాల్గొన్నారు.

26న ప్రైవేట్ ఎలక్ట్రిషియన్‌ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని చంద్రమౌళి పార్కులో రేపల్లె ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఈ నెల 26వ తేదీ ఆదివారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించబడునని అసోసియేషన్ అధ్యక్షుడు అంకిరెడ్డి ఉపేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఎలక్ట్రీషియన్‌ల సమస్యలపై చర్చించటం జరుగుతుందన్నారు. 27వ తేదీన జాతీయ ఎలక్ట్రీషియన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓల్డ్‌టౌన్ అంకమ్మ చెట్టు నుంచి ఇసుకపల్లి వరకు అసోసియేషన్ సభ్యులతో బైక్ ర్యాలీ, జెండా ఆవిష్కరణ నిర్వహించబడతాయన్నారు. అసోసియేషన్ సభ్యులందరు ఆయా కార్యక్రమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బాల్య వివాహాలతో అనర్థాలే ఎక్కువ



మాట్లాడుతున్న లక్ష్మణ్‌నందన్

తెనాలి: రూరల్ మండల పరిధిలోని సంగంజాగర్లమూడిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగంలోని రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ సంయుక్త ఆధ్వర్యంలో 'బేటీ బచావో.. బేటీ పడావో'పై అవగాహన సదస్సును జరిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.శివరామకృష్ణ అధ్యక్షత వహించారు. రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ గుంటూరు టీమ్ సభ్యుడు వాకా లక్ష్మణ్‌నందన్ మాట్లాడారు. భారతదేశంలో లింగ వివక్షతను నిర్మూలించడానికి, ఆడపిల్లల రక్షణ కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమాన్ని ప్రారంభించి పదేళ్లు అవుతోందని చెప్పారు. ఈ సందర్భంగా ఈ పథకంపై బాలికలకు అవగాహన సదస్సు ఏర్పాటుచేసినట్టు తెలిపారు. పథకం ఉద్దేశాన్ని, చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. బాలల రక్షణ కోసం హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 అందరికీ అందుబాటులో ఉంటుందని చెప్పారు. బాల్య వివాహాలు జరక్కుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అక్షరాస్యత శాతాన్ని పెంచి బాల కార్మికత్వాన్ని నిర్మూలించాలని తెలియజేశారు. అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయుడు శివరామకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో తల్లిదండ్రులు కొందరు తమ ఆడపిల్లలను పదోతరగతి చదువుతో విద్యను పూర్తిగా ఆపివేస్తున్నారని తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థినులను సైతం చదువు చెప్పించటం ఆపేసి, వివాహాలకు ప్రోత్సహించడం మంచి పద్ధతి కాదని సూచించారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను తెలియజేశారు. స్థానిక అంగన్‌వాడీ టీచర్లు ఎం.శివ పార్వతి, వి.లక్ష్మి, నాగలక్ష్మి, అనురాధ, శివమ్మ, లక్ష్మీ తిరుపతమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల పైనా ఆసక్తి అవసరం



తెనాలి అర్బన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పైనా ఆసక్తి పెంచుకోవాలని వన్‌టౌన్ ఎస్ఐ సుబ్బయ్య సూచించారు. భాష్యం స్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తూ క్రీడలను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. క్రీడలలో పాల్గొనటం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రాము, వైస్ ప్రిన్సిపాల్ మోహన్‌దాసు, హెచ్ఎం ఇంద్రజ, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

మున్నంగి(కొల్లిపర): మండల పరిధి మున్నంగిలోని ఓ రేకుల పాకలో రహస్యంగా పేకాటాడుతున్న ఏడుగురిని ఎస్ఐ పి.కోటేశ్వరరావు బుధవారం అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.13,900 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఏఎస్ఐ పోతురాజు, కానిస్టేబుల్ నాగబాబు పాల్గొన్నారు.